ఓటు హక్కుపై అవగాహన అవసరం

- వాడవాడలా ర్యాలీలు
- సీనియర్ ఓటర్లకు సన్మానం
- విజేతలకు బహుమతుల ప్రదానం



చింతలపూడి : ఓటర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ముక్కంటి

చింతలపూడి : ప్రతి ఒక్కరూ ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ముక్కంటి పిలుపునిచ్చారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం తహసీల్దార్ కార్యాలయం నుంచి ఫైర్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. తహసీల్దార్ డీఎల్ ప్రమద్వర, డీటీ షేక్ షకీలా, ఎంఈఓ–2 కిరణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

● ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ విద్యార్థులకు వక్తృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు ప్రశంసా పత్రాలను అందజేశారు. అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఎన్‌సీసీ అధికారిణి లెఫ్టినెంట్ జి జీవన్ మౌనిక, అధ్యాపకులు, క్యాడేట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్లలో చైతన్యం తేవాలి

లింగపాలెం : ఓటు ప్రాధాన్యతను తెలియజెప్పి, ఓటర్లలో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని తహసీల్దార్ ఎండీ నజీముల్లాషా అన్నారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయం నుంచి లింగపాలెం సెంటర్ వరకు ర్యాలీ, మానవహారం, ప్రతిజ్ఞ నిర్వహించారు. సీనియర్ సిటిజన్లను తహసీల్దార్, గ్రామ సర్పంచ్ తగరం హేమలత, అధికారులు ఘనంగా సన్మానించారు. వ్యాసరచన, ఉపన్యాసం పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎంపీడీఓ కె.వాణి, ఎంఈఓ కె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఓటరు దినోత్సవం

జంగారెడ్డిగూడెం: 18 సంవత్సరాలు నిండిన వారంతా ఓటు నమోదు చేయించుకోవాలని ఆర్డీఓ ఎంవీ రమణ అన్నారు. జంగారెడ్డిగూడెం వెంకటేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీలో ఓటరు దినోత్సవాన్ని తహసీల్దార్ కె.స్లీవజోజి ఆధ్వర్యంలో నిర్వహించారు. వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు మెమొంటోలు, సర్టిఫికెట్స్ అందజేశారు. సీనియర్ ఓటర్లను సన్మానించారు. బాగా పనిచేసిన బూత్ లెవెల్ ఆఫీసర్స్‌కి సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ర్యాలీ, మానవహారం నిర్వహించారు.

● శ్రీరామచంద్ర విద్యాసంస్థల కూడలిలో మానవహారం నిర్వహించారు. ఓటు నమోదు ఆవశ్యతపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ పీఓ పి.బ్యూల, ఎంఈఓ బి.రాములు మాట్లాడారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కె.లక్ష్మి, ఎం.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● ఓటర్ల దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని కూనిశెట్టి కీర్తన మూడవ స్థానంలో నిలిచి కలెక్టర్ వెట్రిసెల్వి చేతుల మీదుగా బహుమతి అందుకున్నట్టు ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎం విజయప్రకాష్ తెలిపారు. ఆమెను పాఠశాలలో అభినందించారు.

డిగ్రీ కాలేజీలో..

కామవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటు హక్కు ప్రాముఖ్యతపై వైస్ ప్రిన్సిపాల్ ఎం మల్లేశ్వరరావు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ, ర్యాలీ నిర్వహించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ జి.శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఓటు వినియోగం పౌరుడి బాధ్యత

కొయ్యలగూడెం: ఓటు హక్కును కలిగి ఉండడం, దానిని వినియోగించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఆర్డీఓ ఎంవీ రమణ పేర్కొన్నారు. శనివారం కొయ్యలగూడెంలో నిర్వహించిన ర్యాలీ, ఓటర్ల అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి గణేష్ సెంట్రల్ వరకు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ కృష్ణకుమారి, ఆర్ఐ మణిదివ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఓటర్ల దినోత్సవం

పోలవరం రూరల్: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలవరంలో సీనియర్ ఓటర్లను శాలువా కప్పి సన్మానించారు. ప్రభుత్వ పాఠశాల నుంచి ఏటిగట్టు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు 2కె రన్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, పోలవరం సర్పంచ్ పాడుం పుష్ప, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటరు దినోత్సవం

వేలేరుపాడు: వేలేరుపాడులో ర్యాలీ నిర్వహించి, ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సీనియర్ ఓటర్లను సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ, ప్రత్యేకాధికారి జి.రామ్మోహనరావు, తహసీల్దార్ డీవీ సత్యనారాయణ, ఎంపీడీఓ ఎం.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో..

ద్వారకాతిరుమల: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థినులతో ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు. సచివాలయం–2 మహిళా పోలీస్ లక్ష్మీ సుజన ఓటు ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెంలో..

బుట్టాయగూడెం: స్థానిక నెహ్రూబొమ్మ సెంటర్ వద్ద మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ పీవీ చలపతిరావు ఓటర్ల దినోత్సవ ప్రధాన ఉద్దేశాన్ని వివరించారు.


లింగపాలెం : సీనియర్ సిటిజన్‌లను సన్మానిస్తున్న దృశ్యం



జంగారెడ్డిగూడెం : ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


పోలవరం రూరల్ : సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న దృశ్యం

జనన, మరణాల నమోదుపై అశ్రద్ధ వద్దు

పోలవరం రూరల్: జనన, మరణాల నమోదు విషయంలో అశ్రద్ధ వహించవద్దని ఎంపీడీఓ కె.శ్రీనివాసరావు అన్నారు. పోలవరం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన వింజరం పీహెచ్‌సీ వైద్యాధికారి మురళీకృష్ణ, ఎల్ఎన్‌డీపేట పీహెచ్‌సీ వైద్యాధికారి నిఖిల్‌తో కలిసి వైద్యారోగ్యశాఖ సిబ్బందితో జనన, మరణాల నమోదుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

ద్వారకాతిరుమల: మండలంలోని లైన్ గోపాలపురంలో పేకాట శిబిరంపై శనివారం పోలీసులు దాడి చేశారు. ఇదర్ని అదుపులోకి తీసుకుని, రూ.20,500 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం


ప్రమాదానికి గురైన ఆశిబాబు

జంగారెడ్డిగూడెం : స్థానిక బైనేరు వంతెన వద్ద శనివారం అగాపే స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు, దివ్యాంగ ఉపాధ్యాయుడు ఆశిబాబు ప్రమాదానికి గురయ్యారు. ఆయన నడుపుతున్న వాహనాన్ని లారీ ఢీకొట్టడంతో ఆశిబాబు స్వల్పంగా గాయపడ్డారు. ఆశిబాబు నడుపుతున్న త్రిచక్ర వాహనం దెబ్బతింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఆశిబాబుకు స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స అందించారు.

బెల్లపు ఊట ధ్వంసం

బుట్టాయగూడెం: మండలంలోని కొల్లాయిగూడెం శివారు బైనేరు వాగు సమీపంలో సారా స్థావరంపై ఎక్సైజ్ అధికారులు శనివారం దాడులు చేశారు. సారా తయారీకి ఉపయోగించే పులిసిన 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ వైపీఎస్ఎస్ ఫణికుమార్ తెలిపారు. కార్యక్రమంలో అధికారులు ఎస్‌కే ఆరిఫ్, కె.వీరబ్రహ్మం, జి.సునీల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

మురుగుకూపంలా పాతాళకుంట వాగు


అధ్వానంగా ఉన్న పాతాళకుంట వాగు

లింగపాలెం : ధర్మాజీగూడెంలో ఇళ్ల మధ్య నుంచి ప్రవహిస్తున్న పాతాళకుంట వాగు మురుగు కూపంలా మారింది. నీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయి. వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉందని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలువలో చెత్తాచెదారాన్ని తొలగించి మురుగు ముందుకు పారేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఇదే గ్రామానికి చెందిన ఎమ్మెల్యే సొంగా రోషన్ సమస్యపై దృష్టి సారించి శాశ్వత పరిష్కారం చూపిస్తారని ప్రజలు ఆశిస్తున్నారు.

తహసీల్దార్ దొరకు అవార్డు



అవార్డును అందుకుంటున్న తహసీల్దార్ దొర

కొయ్యలగూడెం: జిల్లా ఉత్తమ ఎలక్ట్రోల్ అవార్డు (డిస్ట్రిక్ట్ బెస్ట్ ఎలక్ట్రోల్) అందుకోవటం తనపై మరింత బాధ్యతను పెంచిందని తహసీల్దార్ కె.చెల్లన్నదొర శనివారం పేర్కొన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవ సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కె.విజయ్ఆనంద్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు తెలిపారు. బీఎల్ఓల కృషి, రెవెన్యూ అధికారుల తోడ్పాటు, తన వంతు విధి నిర్వహణ వల్ల అవార్డు సాధించానని దొర పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ఈ అవార్డు రావడం పట్ల గవర్నర్‌తో పాటు కలెక్టర్, రెవెన్యూ అధికారులు చెల్లన్నదొరకు అభినందనలు ప్రకటించారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం


సూర్యనారాయణ మూర్తి దంపతులకు బాండ్ పత్రం అందిస్తున్న హయగ్రీవ

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు శనివారం రూ.1,00,116ను విరాళంగా అందజేశారు. ఏలూరుకు చెందిన ఈమని సూర్యనారాయణ మూర్తి, మహతి కుమారి దంపతులు ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. దాతకు ఆలయ సూపరింటెండెంట్ హయగ్రీవ విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

చిన్నారులకు సామగ్రి పంపిణీ


సామగ్రి పంపిణీ చేస్తున్న జడ్జిలు

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన కామవరంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆత్మబంధువులం సేవా సంస్థ (తాడేపల్లిగూడెం) ఏర్పాటు చేసిన సామగ్రిని జంగారెడ్డిగూడెం జూనియర్ సివిల్ జడ్జి కె. కిషోర్‌కుమార్, జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ రాజరాజేశ్వరి తేజస్విల చేతుల మీదుగా పంపిణీ చేశారు. సంస్థ ఫౌండర్ శాతాల ఉషాకిరణ్, న్యాయవాదులు యు.ఏసుబాబు, ఎ.శ్రీనివాసరావు, ఎం రామ్మోహన్‌రావు, ఎం క్రాంతికుమార్, పి.పెద్దిరాజు, ఏవీవీ భువనేశ్వరి, బి.సాయికుమారి, హిమబిందు, పద్మిణి, సర్పంచ్ కె.గంగరాజు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరామర్శ


సత్యవతి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గురునాథరావు

కొయ్యలగూడెం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెట్టి గురునాథరావు గవరవరం వైఎస్సార్ సీపీ నాయకులు తాండ్రు గంగరాజు, గంగాధరరావుల కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. వారి తల్లి సత్యవతి ఇటీవల మృతి చెందడంతో ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. గవరవరం పంచాయతీ పేదలను ఆదుకోవడంలో సత్యవతి కృషి ఆదర్శనీయమని జెట్టి కొనియాడారు. పార్టీ నాయకులు చీమకుర్తి సత్యనారాయణ, గంటా రమేష్, కసుకుర్తి వేణు, కాట్రూ అబ్బులు, బొమ్మా శ్రీను, చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి వనిత పరామర్శలు


సుబ్రహ్మణ్యం కుటుంబాన్ని పరామర్శిస్తున్న వనిత

ద్వారకాతిరుమల: ఇటీవల ప్రమాద వశాత్తు గాయపడిన వైఎస్సార్ సీపీ నాయకులను, మృతి చెందిన వారి కుటుంబాలను మాజీ హోం మంత్రి తానేటి వనిత శనివారం పరామర్శించారు. రెండు రోజుల క్రితం ప్రమాద వశాత్తు కాలికి గాయమై, విర్డ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబును, ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఎస్ఎస్ వేదిక ఫంక్షన్‌హాల్ యజమాని బొండాడ రామ్మోహన్ రావు (రాంపండు)ను ఆమె పరామర్శించారు. మూడు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన పార్టీ నేత చిలుకూరి సుబ్రహ్మణ్యం ఇంటికెళ్లి, ఆయన కుటుంబాన్ని పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాడేపల్లి రమేష్ ఇంటికి వెళ్లి ఇటీవల మృతి చెందిన ఆయన తండ్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వనిత వెంట పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, బొండాడ వెంకన్నబాబు, అచ్యుత ఏసుబాబు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, పానమాల ఉమామహేశ్వరరావు, చిలుకూరి నాగ సుబ్రహ్మణ్యం, చిలుకూరి చంద్రం, రుద్ర శివాజీ, కొల్లి సుబ్బారావు, చెన్నూరి రామకృష్ణ, చిలుకూరి వెంకన్నబాబు, దూలపల్లి ప్రసాద్, షేక్ బాషా, మల్లెపూడి నాగమణి, భోగరాజు సాయికృష్ణ, మద్దిపాటి చిన్న సోమేశ్వరరావు తదితరులున్నారు.

పాఠశాలల్లో శాట్ ఆర్పీల తనిఖీలు


గురుకుల పాఠశాలలో వంట చేసే విధానాన్ని పరిశీలిస్తున్న శాట్ డీఆర్పీలు

ద్వారకాతిరుమల: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో శనివారం శాట్ డీఆర్పీలు డి.గోవింద్, పి.ధనలక్ష్మిలు సామాజిక తనిఖీలు నిర్వహించారు. రికార్డుల నిర్వహణ, స్టోర్ రూమ్, పరిశుభ్రత, వంట చేసే విధానం, భోజనం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థినుల అభిప్రాయాలను సేకరించారు. అనంతరం విద్యార్థినుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. రికార్డుల నిర్వహణ, భోజనం నాణ్యత, టీచింగ్ విధానం, మరుగుదొడ్ల పరిశుభ్రత అన్నీ సకాలంలో నిర్వహిస్తున్నట్టు తనిఖీ సిబ్బంది తెలిపారు.

పాఠశాలలో సామాజిక తనిఖీ

జంగారెడ్డిగూడెం: మండలంలోని లక్కవరం శ్రీరాజా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం డీఆర్‌పీ సుదర్శన్, ఎం మీనాల బృందం సామాజిక తనిఖీ నిర్వహించారు. శుభ్రత, మౌలిక వసతులు, మధ్యాహ్న భోజన పథకం అమలు, ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల హాజరు, రిజస్టర్లను పరిశీలించారు. పాఠశాల కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. హెచ్‌ఎం జె.చెంచులక్ష్మి, పాఠశాల కమిటీ చైర్మన్ దల్లి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

దళితులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి


ఇళ్ల పట్టాల కోసం నిరసన వ్యక్తం చేస్తున్న పాతూరు గ్రామస్తులు

కామవరపుకోట: గత 70 ఏళ్లుగా దళితులు నివాసం ఉంటున్న ఇళ్లకు పట్టాలి ఇవ్వాలని కేవీపీఎస్ కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ డిమాండ్ చేశారు. శనివారం పాతూరు దళిత కాలనీ వాసులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఇళ్ల పట్టాల కోసం రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేశారని, స్థానిక అధికారులు పరిశీలిస్తామని చెప్పి 20 రోజులు దాటినా స్పందన లేదని ఫ్రాన్సిస్ ఆరోపించారు. దళితుల సమస్యలు పరిష్కరించాలని, దళితులు సాగులో ఉన్న భూములకు ఆన్‌లైన్ నమోదు చేసి పట్టా పాస్‌బుక్ ఇవ్వాలని, రైతు భరోసా వచ్చేలాగా కృషి చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అడవి కొట్టు దుర్గారావు, రామకృష్ణ, స్వామి, నాగర్జున, మాటూరు వీరయ్య, ఎ.ప్రకాష్, అందుగుల భవాని, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాండ్ర పాపారాయుడుకు నివాళి


పాపారాయుడు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

జంగారెడ్డిగూడెం: స్థానిక పట్టణ వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు భీమిరెడ్డి జోగిబాబు, కార్యదర్శి పైల చంటి తాండ్ర పాపారాయుడు 267 వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాజాన సత్యనారాయణ పాపారాయుడు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాపారాయుడు ఆశయాలకు అనుగుణంగా వెలమ జాతి అభివృద్ధికి కృషి చేయాలని రాజాన సూచించారు. అనంతరం సంఘం 2025 క్యాలండర్‌ను విడుదల చేశారు. మిఠాయిలు పంచారు. సంఘం పూర్వపు అధ్యక్షులు రొంగల నాగేశ్వరరావు, రొంగల పుల్లయ్య, గాలి నూకరాజు, కౌన్సిలర్లు చిటికల అచ్యుత రామయ్య, లోకవరపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గర్భకోశ వ్యాధులను నిర్లక్ష్యం చేయవద్దు


లింగపాలెం : కొణిజర్లలో గేదెను పరీక్షిస్తున్న డాక్టర్ మహేష్


కొయ్యలగూడెం : పాత పరింపుడిలో మందులు అందిస్తున్న దృశ్యం.

లింగపాలెం : పశువుల గర్భకోశ్యాధులను నిర్లక్ష్యం చేయవద్దని లింగపాలెం పశువైద్యశాల అధికారి మహేష్ అన్నారు. శనివారం కొణిజర్ల, ఆశన్నగూడెం గ్రామాల్లో గొర్రెలు, దూడలకు డివార్మింగ్ చేశారు. గేదెలకు వైద్య పరీక్షలు చేశారు. పశువులకు గర్భకోశ వ్యాధులకు సంబంధించి ఇంజక్షన్లు ఇచ్చారు. 13 పశువులకు చూడి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మోహన్, వెంకటరెడ్డి, రాంబాబు, గోపాల్, అశ్వినికుమార్, వి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

శిబిరాలతో రైతులకు లబ్ధి

కొయ్యలగూడెం: పశు వైద్య శిబిరాలతో రైతులకు లబ్ధి చేకూరుతుందని పశువైద్య శాఖ అధికారి డీఆర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. పాత పరింపూడి గ్రామంలో శనివారం ఏర్పాటుచేసిన శిబిరాన్ని ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ప్రారంభించారు. సుమారు 350 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. తొమ్మిది పశువులకు గర్భకోశ పరీక్షలు చేశారు. సుమారు 200 మేకలకు, గొర్రెలకు పాక్స్ వాక్సిన్ వేశారు. నట్టలు నివారణ మందు తాగించారు. 2 వేల కోళ్లకు కొక్కెర తెగులు రాకుండా వ్యాక్సిన్ వేశారు. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, రైతు సేవా కేంద్రంలోని పశుసంవర్ధక సహాయకులు జి.సత్యవతి, ఈఓ కె.సురేష్, కె.సతీష్, పి.వెన్నెల, కార్యాలయ సహాయ కార్మికులు టి.వెంకటేశ్వరరావు, చోడిపిండి సుబ్రహ్మణ్యం మట్టా శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పరిషత్ సభ్యులందరికీ సమ ప్రాధాన్యత


మండల పరిషత్ కార్యాలయ వ్యవహార శైలిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వైస్ ఎంపీపీ గంగరాజు

కొయ్యలగూడెం: మండల పరిషత్తు సభ్యులందరూ సమానమేనని నిధుల మంజూరు లేదా ప్రాధాన్యతలో ఏ ఒక్కరికో హెచ్చుతగ్గులకు ఆస్కారం ఉండదని ఎంపీడీఓ కె.కిరణ్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగారాజుతో సహా పలువురు ఎంపీటీసీ సభ్యులు నిధుల మంజూరుపై చేసిన అభియోగానికి ఎంపీడీఓ పైవిధంగా సమాధానం ఇచ్చారు. గత రెండు అజెండా అంశాలను పక్కనపెట్టి ఏకపక్షంగా మండల పరిషత్తు సమావేశం నిర్వహిస్తూ వచ్చారని, నిధుల మంజూరు, వినియోగంపై సభ్యులకు సమాధానం ఇవ్వడం లేదని వచ్చిన ఆరోపణలపై ఎంపీపీ గంజిమాల రామారావుతో కలిసి ఎంపీడీఓ వారిని సంతృప్తి పరిచే ప్రయత్నం చేశారు. ప్రస్తుత మండల పరిషత్ కార్యవర్గం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు రూ.33.5 కోట్లు 17 పంచాయతీల పరిధిలో అభివృద్ధి పనులకు వినియోగించినట్టు ఎంపీడీఓ తెలిపారు. తాను అవకతవకలకు ఆస్కారం లేకుండా కృషి చేస్తానని, మండల ప్రజా ప్రతినిధుల ఒత్తిళ్లకు లొంగేది లేదని ఆయన సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కొందరు ఎంపీటీసీలు నిధులు అడగడం వల్ల అజెండాలో లేనప్పటికీ మంజూరు చేయాల్సి వచ్చిందన్నారు. మండల ప్రజా ప్రతినిధులకు, సభ్యులకు మధ్య విభేదాలు ఉంటే మరోమారు భేటీ ఏర్పాటు చేసుకొని పరిష్కరించుకోవాలని ఎంపీడీఓ సూచించారు. ఇకపై సమావేశాలకు అజెండా ఉండాలని, అత్యవసర నిధుల మంజూరుపై కనీసం వైస్ ఎంపీపీల దృష్టి కైనా తీసుకువెళ్లాలని సభ్యులు కోరారు. కాగా అవుట్‌సోర్సింగ్ పోస్టులు ఏర్పాటు చేసి, వారికి వెచ్చించిన జీతభత్యాలను అడిగిన సభ్యులందరికీ తెలియజేయాలని ఏఓను ఎంపీడీఓ ఆదేశించారు. జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, వైస్ ఎంపీపీ మట్టా వనజాలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణకుమారి, సర్పంచులు ఎంపీటీసీలు వివిధ శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

స్థలాల మంజూరు కోరుతూ ధర్నా



బుట్టాయగూడెంలో ర్యాలీ చేస్తున్న సీపీఐ నాయకులు

బుట్టాయగూడెం: ఏజెన్సీలో గిరిజన, గిరిజనేతర పేదలకు ఇళ్లు స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర నాయకులు డేగా ప్రభాకరరావు, నాయకులు మండవ కృష్ణచైతన్య, కారం దారయ్య, తదితరులు మాట్లాడారు. పేద గిరిజన, గిరిజనేతరులకు ఇళ్లు, స్థలాలతోపాటు పోడు, బంజర భూములకు పట్టాలివ్వాలని కోరారు. గ్రామాల్లో రహదారి సౌకర్యం కల్పించాలన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో సీపీఐ కార్యాలయాన్ని కూల్చివెయ్యడం దుర్మార్గమని తెలిపారు. అనంతరం తహసీల్దార్ చలపతిరావుకు వినతిపత్రం అందజేశారు. తొలుత బుట్టాయగూడెంలో భారీ ర్యాలీ చేశారు. నాయకులు చోడెం దుర్గ, బేతి కిశోర్, తదితరులు పాల్గొన్నారు.